
సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 25 । జనవరి । 2025



ప్రజల సొమ్ము రోడ్డు పాలు

సీసీ రోడ్లు కూటమి నాయకులకు వరంగా మారాయి. సీసీ రోడ్డుపైనే వేసి మరో రోడ్డు వేసి బిల్లులు చేయించుకుని లబ్ధి పొందుతున్నారు. II లో



పెళ్లి బాజా మోగేనంట

ఈ నెల 22 నుంచే పెళ్లిళ్ల ముహూర్తాలు ప్రారంభం కానున్నా, కొందరు ఈ నెల 30 నుంచి మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాదంతా పెళ్లి సందడే. II లో



ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలి

కొబ్బరి ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలని ఉండి కేవీకే హెడ్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. కేవీకేలో కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ప్రారంభించారు. II లో

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ ఆలయంలో పూజలు



మావుళ్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: మావుళ్ళమ్మ ఆలయంలో శుక్రవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించారు.

గీత కార్మికుల మద్యం షాపులకు లాటరీ



కలెక్టరేట్‌లో మద్యం షాపుల ఎంపికకు లాటరీ తీస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలోని గీత కార్మికులకు కులాల వారీగా 18 మద్యం షాపులకు ప్రాంతాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి లాటరీ పద్ధతిలో కేటాయించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీలో టోకెన్ ద్వారా ప్రాంతాలను ఎంపిక చేశారు. శెట్టిబలిజకు -10, గౌడకు-5, గౌడ్‌కు-2, శ్రీశయన కులానికి ఒకటి చొప్పున షాపులు కేటాయించగా లాటరీ ద్వారా నిర్ణయించారు. భీమవరం-శెట్టిబలిజ, తణుకు-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం-గౌడ, నరసాపురం-శెట్టిబలిజ, ఆకివీడు నగర పంచాయతీ-శెట్టిబలిజ, ఆకివీడు రూరల్-గౌడ, గణపవరం-గౌడ, అత్తిలి-శ్రీశయన, ఇరగవరం-గౌడ, నరసాపురం రూరల్ -శెట్టిబలిజ, వీరవాసరం-గౌడ, ఆచంట-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్-గౌడ, మొగల్తూరు-శెట్టిబలిజ, పెనుగొండ-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్-శెట్టిబలిజ, తణుకు రూరల్-శెట్టిబలిజ, పెనుమంట్ర-గౌడ, పోడూరు-శెట్టిబలిజ కులాలకు లాటరీ ద్వారా రిజర్వ్ చేశారు. ఫిబ్రవరి 7న ఉదయం 10 గంటలకు లాటరీ ద్వారా ఎంపిక చేసి షాపులను మంజూరు చేస్తామన్నారు.

27న డ్వాక్రా యానిమేటర్ల దీక్షలు

భీమవరం: డ్వాక్రా యానిమేటర్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 నుంచి కలెక్టరేట్ వద్ద దీక్షలను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ కోరారు. శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల నాయకుడు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లకు రాజకీయ వేధింపులు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.



బాలుడి తల్లిదండ్రులు అన్నూ, వంశీ



బాలుడు విక్కీ



ఘటనాస్థలిలో ఎగసిపడుతున్న మంటలు



చరణ్



కార్తీక్



షారుఖాన్

హాహాకారాలు.. ఆర్తనాదాలు..

- భైరవపట్నం అగ్నిప్రమాదంలో హృదయ విదారక దృశ్యాలు
- నలుగురికి 60 శాతం పైగా గాయాలు
- కలచివేసిన బాలుడు విక్కీ పరిస్థితి
- మినీ సిలిండర్ పేలడంతో అగ్నిప్రమాదం

కైకలూరు: ఏలూరు జిల్లా మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ఒకే కుటుంబంలోని ఆరుగురు తీవ్రంగా గాయపడడంతో భీతావహ వాతావరణం నెలకొంది. హాహాకారాలు.. ఆర్తనాదాలతో కైకలూరు ప్రభుత్వాసుపత్రి శుక్రవారం రాత్రి దద్దరిల్లింది. బిడ్డకు ఏమైందోనని తల్లి.. భార్య, కొడుకు ఎక్కడా అంటూ తండ్రి పడే రోదన అందరి కళ్లలో నీళ్లు తెప్పించాయి. భైరవపట్నంలో శుక్రవారం రాత్రి మినీ సిలిండర్ పేలడంతో పది గుడిసెలు దగ్ధమవగా.. ఒక గుడిసెలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో డబ్బా వంశీ(25), అన్ను(21) భార్యభర్తలు. వీరికి విక్కీ అనే మూడేళ్ల బాలుడు ఉన్నాడు. అన్ను తండ్రి షారుఖాన్(45), అన్ను సోదరులు చరణ్(19), కార్తీక్(18) ఒకే గుడిసెలో ఉంటున్నారు. గుడిసెల్లో ఉంటున్న వారంతా నెల్లూరు నుంచి 20 ఏళ్ల క్రితం వలసవచ్చి చెరువులపై పిట్టలు కొట్టి పొట్ట పోసుకుంటున్నారు. అయితే ఒక చిన్న ప్రమాదం ఆ కుటుంబాల్ని రోడ్డు పాలు చేసింది. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ పేదలు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఒక చిన్నారితో పాటు మరో ముగ్గురికి దాదాపు 60 శాతం పైగానే కాలిపోవడంతో వారంతా తీవ్ర గాయాలతో అల్లాడుతున్నారు. చిన్నారి ఒళ్లంతా కాలిపోయి నరకయాతన అనుభవించడం అందరినీ కలచివేసింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో మిగతా గుడిసెలకు మంటలు అంటుకోకుండా ఆస్తి, ప్రాణ నష్టాన్ని నిలువరించారు.

చిన్నారికి పాలు కోసం అన్ను మినీ గ్యాస్ సిలిండర్‌పై పాలు పెట్టింది. ఈ లోపు బాబు ఏడవడంతో అక్కడికి వెళ్లింది. ఇంతలో పాలు మరిగి పొంగడంతో సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. గుడిసెలకు ప్లాస్టిక్ బ్యానర్లు ఉండటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సిలిండర్ పేలి సమీపంలోని గుడిసెలకు నిప్పు అంటుకుంది. అక్కడ ఉన్న సిలిండర్లు కూడా పేలాయి. గతంలో వీరి కుటుంబాల్లో గన్ పౌడర్ పేలి అనేక మంది మరణించారు.

నన్ను చంపేయండి..

శరీరం బాగా కాలడంతో కార్తీక్ 'నన్ను చంపేయండి.. నేను ఈ బాధను తట్టుకోలేకపోతున్నాను' అంటూ రోదించిన తీరు అందరినీ కలచివేసింది. చరణ్ కూడా శరీరం కాలడంతో బిగ్గరగా కేకలు వేశాడు. అన్ను ఒక చోట, బిడ్డ విక్కీ మరో చోట నరకయాతన అనుభవించారు. విక్కీని చూసిన అందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్సైలు వెంకట్‌కుమార్, రాంబాబు, పోలీసు సిబ్బంది సహాయం చేశారు. స్థానికులు రాత్రి సమయంలో అరిటాకులు తీసుకొచ్చి అందించారు.

కొల్లేరులో కల్లోలం

- సుప్రీం వ్యాఖ్యలతో లంక గ్రామాల్లో అలజడి
- నేడు కొల్లేరు పెద్దల కీలక సమావేశం
- కొల్లేరులో 15,339 ఎకరాల ఆక్రమణలు
- 90 రోజుల్లోగా హద్దులు నిర్ణయించాలని సుప్రీం ఆదేశం
- మళ్లీ పోరుబాట పట్టనున్న లంక వాసులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సుప్రీంకోర్టు తాజా ఆదేశంతో కొల్లేరులో తీవ్ర కల్లోలం రేగింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సులో ఆక్రమణలపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో లంక గ్రామాల్లో అలజడి రేగింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న కొల్లేరులోని ఆక్రమణలను 90 రోజుల్లో తొలగించాలని సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడంతో లంక గ్రామాలు మళ్లీ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. తమ జీవనోపాధికి గండి కొట్టే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కైకలూరులో కొల్లేరు పెద్దల కీలక భేటీ జరగనుంది.

సుప్రీం వ్యాఖ్యలతో అప్రమత్తం

కొల్లేరు ఆక్రమణలపై సుప్రీంకోర్టు ఈ నెల 16న కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలకు అవగాహన కల్పించి 90 రోజుల్లోగా కొల్లేరు సరిహద్దులను ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో అధికారులు కూడా కుమ్మక్కయ్యారనే విషయాన్ని కొట్టి పారేయలేమని వ్యాఖ్యలు చేస్తూ మార్చి 19 నాటికి తదుపరి విచారణ వాయిదా వేశారు. ఈ పరిణామ క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కొల్లేరు ఆక్రమణలపై దృష్టి సారించడంతో లంక గ్రామాల్లో కలకలం రేగింది.

నేడు కీలక సమావేశం

కొల్లేరు పెద్దల సమావేశానికి కొల్లేరు పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. లంక గ్రామాల నుంచి జనసమీకరణ కూడా బలంగానే నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు. తద్వారా కొల్లేరువాణిని బలంగా వినిపించాలని నిర్ణయించారు. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యల దృష్ట్యా కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో శనివారం సాయంత్రం 4 గంటలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కొల్లేరు పెద్దలు, ప్రజాప్రతినిధులతో కీలక సమావేశం జరగనుంది. కొల్లేరు పరివాహక నియోజకవర్గ ఎమ్మెల్యేలైన కామినేని శ్రీనివాస్(కైకలూరు), పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), చింతమనేని ప్రభాకర్(దెందులూరు), బడేటి రాధాకృష్ణయ్య(ఏలూరు)తో పాటు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వడ్డీ సాధికారత రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజులతో పాటు ప్రజాప్రతినిధులు, కొల్లేరు పెద్దలు హాజరు కానున్నారు.

భారీగా జనసమీకరణ

కొల్లేరు గ్రామాల నుంచి భారీ జనసమీకరణ జరిగే అవకాశం ఉంది. ఈ సభను బలప్రదర్శనగా నిర్వహించాలని లంక గ్రామాల పెద్దలు నిర్ణయించారు. కొల్లేరులోని 89 గ్రామాల్లో సుమారు 3 లక్షల జనాభా ఉన్నారు. ప్రజాప్రతినిధులు కూడా హాజరు కానున్న క్రమంలో కొల్లేరు వాసులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌ను జాతీయ స్థాయిలో వినిపించడానికి ఈ సమావేశాన్ని వేదికగా చేసుకోనున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

77,138 ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రామ్‌సార్ సదస్సు గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. ఆక్రమణల వల్ల కొల్లేరు కాలుష్యంగా మారడంతో పర్యావరణవేత్తల ఫిర్యాదులతో 1999 అక్టోబరు 4న అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 120ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి, పూర్వ కృష్ణా జిల్లాలో 9 మండలాల్లో +5 కాంటూరు పరిధి వరకు 77,138 ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యంగా గుర్తించారు. ఆక్రమణల పర్వం పెరగడంతో 2006 సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరు ఆపరేషన్ చేపట్టారు. కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యంలో దాదాపు 15,339 ఎకరాల ఆక్రమణలకు గురైనట్లు అటవీశాఖ అధికారులే నిర్ధారించి కోర్టుకు నివేదించారు. ఏలూరు మండలంలో 23,900 ఎకరాలు, ఉంగుటూరులో 134 ఎకరాలు, పెదపాడులో 789 ఎకరాలు, దెందులూరులో 586 ఎకరాలు, నిడమర్రులో 6,338 ఎకరాలు, భీమడోలు 20,323 ఎకరాలు, కైకలూరులో 10,295 ఎకరాలు, మండవల్లిలో 7,359 ఎకరాలు, ఆకివీడులో 6,914 ఎకరాలు మొత్తం 77,138 ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యం ఉంది.

కొల్లేరు ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం

ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు లంక గ్రామాల ప్రజలపై హామీల వర్షం కురిపించారు. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఆపరేషన్ కొల్లేరులో ధ్వంసమైన 7,500 ఎకరాల భూమిని తిరిగి పంపిణీ చేస్తామని చెప్పారు. 2014లో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చి మోసం చేసిన విధంగానే 2024 ఎన్నికల్లోనూ హామీని ఇచ్చారు. మరో అడుగు ముందుకు వేసి కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు సంప్రదాయ సాగుకు అనుగుణంగా ఐస్ ఫ్యాక్టరీలతో పాటు, అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని ప్రచారం చేసుకుని ఎన్నికల్లో గెలిచారు. కట్ చేస్తే సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్నా కనీసం లంక ప్రజల పక్షాన కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కాకుండా పరోక్షంగా కొల్లేరు ఆక్రమణల తొలగింపునకు సన్నద్ధమవడంపై కొల్లేరులో తీవ్ర చర్చ సాగుతోంది.

శాశ్వత పరిష్కారం చూపాలి



కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలి. కాంటూరు కుదించి అభయారణ్యాన్ని నిర్ణయిస్తే కొల్లేరు ప్రజలు కాపాడుకుంటాం. భవిష్యత్తు రోజుల్లో కొల్లేరు గ్రామాల నుంచి ఏ విధంగా ముందుకు పోవాలనే విషయాలను నిర్ణయించుకుంటాం. ప్రజాప్రతినిధులు సహకరిస్తారని భావిస్తున్నాం.

– బలే ఏసురాజు, రాష్ట్ర వడ్డీ సాధికారిత కన్వీనర్, కొట్టాడ

కొల్లేరు ప్రజలకు న్యాయం చేయండి



కూటమి ప్రభుత్వం విజయంలో కొల్లేరు గ్రామాల ప్రజలు కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు పెద్ద కష్టం వచ్చింది. కూటమి పార్టీలన్నీ కలసి ఆదుకోవాల్సిన బాధ్యత ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు న్యాయం చేయాలి.

– ముంగర నరసింహారావు, కొల్లేరు ప్రాంత నేత, ఆకివీడు

కుటుంబాలు వలస పోతున్నాయి



కొల్లేరు గ్రామాల్లో పనులు కరువై వలసలు పోతున్నారు. చేపల చెరువులు సాగు మాత్రమే జీవనాధారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు అండగా నిలవాలి. కొల్లేరు ప్రజల వాస్తవ పరిస్థితులను కోర్టుకు తెలిపాలి.

– జయమంగళ కాసులు, పెంచికలమర్రు సర్పంచ్

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



తూర్పుపాలెంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కమిటీల పునఃనిర్మాణం చేపట్టినట్లు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శుక్రవారం తూర్పుపాలెంలో క్యాంపు కార్యాలయంలో 29 అనుబంధ కమిటీల నియామకంపై సమీక్ష నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ నిర్మాణంపై పూర్తి దృష్టి పెట్టారన్నారు. ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పులిదిండి వెంకటేశ్వరరావు కుమారుడు దైవరాజు, కుమార్తె లిఖిత షర్మిలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్లు జక్కంశెట్టి చంటి, పిల్లి నాగన్న, మాజీ ఎంపీపీ మట్టా ఆనందకుమార్, జిల్లా కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, మాజీ డైరెక్టర్లు పోతుమూడి రామచంద్రరావు, కొవ్వూరి వేణు మాధవ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశువధ శాలపై కలెక్టరుకు వినతి



తణుకులో కలెక్టరు నాగరాణికి వినతిపత్రం ఇస్తున్న తేతలి గ్రామ మహిళలు

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలిలో నిర్వహిస్తున్న లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహిస్తున్న పశువధ శాలపై కలెక్టరు చదలవాడ నాగరాణికి తేతలి వాసులు వినతిపత్రం అందచేశారు. తణుకు సజ్జాపురంలోని రామకృష్ణ మఠంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలకు హాజరైన కలెక్టరును తేతలి గ్రామస్తులతోపాటు సజ్జాపురంలోని మహిళలు కలిశారు. ఈ సందర్భంగా పశువధ శాల నుంచి వస్తున్న దుర్వాసనకు స్థానికంగా నివసించలేక పోతున్నామని, ఇళ్లలో ఉండే పిల్లలు సైతం వాంతులు చేసుకుంటున్నారని ఆవేదనను తెలిపారు. దుర్వాసనతోపాటు ఆ ప్రాంతంలో నీరు, గాలి కూడా కలుషితమై రోగాలబారిన పడుతున్నామని వివరించారు. పశువధ శాల అక్రమంగా నిర్వహిస్తున్నారని వారి వద్ద ఉన్న పత్రాలు కూడా సరైనవి కావని కలెక్టరుకు చెప్పారు.



బాలోత్సవాల్లో గ్రూప్ డ్యాన్స్

బాలోత్సవ వైభవం



ఝాన్సీ లక్ష్మీభాయిగా చిన్నారి





కోలాట నృత్యప్రదర్శన

పిల్లలకు మార్కులు, ర్యాంకులే లక్ష్యం కాదని, వారిలో మానసిక వికాసానికి ఆటలు, పాటలు అవసరమేనని జాయింట్ కలెక్టర్ పీ ధాత్రిరెడ్డి అన్నారు. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో హేలాపురి బాలోత్సవం 5 వ పిల్లల సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రిబేష్ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాలోత్సవం జెండాను ఉష గ్రూప్ ఆఫ్ సంస్థల అధినేత ఉష బాలకృష్ణ ఆవిష్కరించారు. ప్రారంభ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ గోపి మూర్తి, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పిల్లలకు దేనిలో అభిరుచి ఉందో దానిపైన ఎక్కువ శ్రద్ధ చూపిస్తే వారు జీవితంలో మంచి స్థానానికి ఎదుగుతారన్నారు. ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటినుంచి శాస్త్రీయ దృక్పథం అలవాటు చేస్తే దేశానికి ఉపయోగపడే పౌరులుగా మారతారన్నారు. ఈ సందర్భంగా రంగు రంగుల దుస్తుల్లో, రకరకాల వేషధారణలో విద్యార్థులు, వారి పక్కన వారి తల్లిదండ్రులు, బంధువులు, ఆటలు, పాటలు, సరదాలు, పోటీలు, కేరింతలతో తొలిరోజు పిల్లల సంబరాలు అంబరాన్ని తాకాయి.

–ఏలూరు (ఆర్ఆర్‌పేట)



పగటి వేషగాడిగా చిన్నారి



వనదేవతగా చిన్నారి

క్లుప్తంగా

30 నుంచి జేఎన్‌టీయూ హ్యాండ్ బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాల హ్యాండ్ బాల్ బాలికల –బాలుర బాలికల విభాగాల్లో టోర్నమెంట్ ఎంపికను ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తామని వేగవరంలోని హేలాపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎం.లావణ్య తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల నుంచి బాలుర విభాగంలో పోటీలకు సుమారుగా 25 జట్లు బాలిక విభాగానికి సుమారుగా 11 జట్లు హ్యాండ్ బాల్ అంతర్ కళాశాలల సెంట్రల్ జోన్ టోర్నమెంట్ ఎంపిక ట్రైల్స్‌కు రానున్నారని తెలిపారు. సమావేశంలో ఏఓ కరుణానిధి పాల్గొన్నారు.

పంట పొలాల్లో బోల్తా కొట్టిన కారు



బోల్తా కొట్టిన వాహనంలో నుంచి డ్రైవర్‌ను బయటికి తీస్తున్న స్థానికులు

చింతలపూడి: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి నుంచి ప్రగడవరం వైపు వెళుతున్న మారుతి కారు శుక్రవారం రోడ్డు మలుపులో అదుపు తప్పి పంట పొలాల్లో దూసుకెళ్లడంతో బోల్తా కొట్టింది. విధి నిర్వహణలో ఆసుపత్రికి వెళుతున్న కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.కృష్ణ కిషోర్ అటుగా వెళ్తున్న ఈ ప్రమాదాన్ని చూసిన వెంటనే స్పందించి కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను చాకచక్యంగా కాపాడారు. ప్రమాదంలో భయాందోళనకు గురైన వాహనంలోని మిగిలిన వారికి వైద్య సేవలు అందించారు.

రేపు ఏలూరులో ఖజానా శాఖ కార్యవర్గ ఎన్నికలు

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఎస్‌ఏ) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం జిల్లా ఖజానా కార్యాలయం ఏలూరులో నిర్వహిస్తామని ఏపీటీఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యుపీ పాండురంగారావు, కప్పల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఖజానా శాఖ ఉద్యోగులంతా తప్పనిసరిగా ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

ప్రజల సొమ్ము రోడ్డు పాలు

- రోడ్డుపై రోడ్డు వేస్తున్న వైనం
- కూటమి నాయకులు చెప్పిందే వేదం

భీమవరం అర్బన్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్లు కూటమి నాయకులకు వరంగా మారాయి. దీంతో వారు చెప్పిందే వేదంగా సీసీ రోడ్డుపైనే వేసి మరో రోడ్డు వేసి బిల్లులు చేయించుకుని లబ్ధి పొందుతున్నారని విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. భీమవరం మండలంలో కొత్తపూసలమర్రు, దొంగపిండి, గూట్లపాడు, దిరుసుమర్రు, యనమదుర్రు తదితర 12 గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా 21 సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డుకు అనుమతులు లభించాయి. మొత్తం 3 కిలోమీటర్లు మేర రూ. 3 కోట్ల 28 నిర్మించాల్సి ఉండగా 20 సీసీ రోడ్లకు గానూ 2.5 కిలోమీటర్లు పూర్తి చేయడంతో రూ. 2 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 7 నెలల్లోనే ఆ పార్టీల నాయకులు కాంట్రాక్టర్లుగా అవతరించడం, మరికొన్ని చోట్ల కాంట్రాక్టర్లను పనుల్లో వాటా అడిగి అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాయకుల ఇళ్లకే రోడ్లు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్లను కూటమి నాయకుల ఇళ్లకు, వారి స్థలాల వైపు వేసుకుని లబ్ధి పొందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొత్తపూసలమర్రు గ్రామంలో ఇటీవల వేసిన 3 సీసీ రోడ్లు గతంలో వేసిన సీసీ రోడ్ల పైనే వేశారు. అలాగే గూట్లపాడులో రెండు, మూడు ఇళ్లు ఉన్న వీధులకు సీసీ రోడ్లు వేశారని కూటమి నాయకులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ముంపు సమస్యతో ఇబ్బందిపడుతున్న శివారు వీధుల్లో రోడ్లు వేయకుండా తమకు నచ్చిన ప్రాంతంలోనే రోడ్లు వేసేలా కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు సీసీ రోడ్లను నాణ్యత లేకుండా వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రోడ్డుపై రోడ్డు వేయడం వల్ల తమ ఇల్లు రోడ్డుకంటే పల్లం అయ్యి వాస్తు తేడా వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ కాలనీల్లో సీసీ రోడ్లు వేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అయితే రోడ్డుపై రోడ్లు వేస్తున్నారు కాలనీల్లో రోడ్లు పిచ్చిమొక్కలు, గడ్డితో అడవిని తలపిస్తున్నా అధికారులకు ఎందుకు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల విషయంలో ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోకపోవడం విశేషం.



కొత్తపూసలమర్రులో వినాయకుడి గుడి వీధిలో సీసీ రోడ్డుపై మళ్లీ వేసిన రోడ్డు



గొల్లవానితిప్ప ఎన్టీఆర్ కాలనీలో పిచ్చిమొక్కలతో ఉన్న రోడ్డు

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి



రూపాయి...రూపాయి పోగుచేసి కష్టపడి ఇల్లు కట్టుకున్నాం. మా కాలనీలో రోడ్లు వేయకపోవడంతో పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచి ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. వర్షాకాలంలో అయితే మోకాళ్లోతు నీళ్లలోంచి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా రోడ్లు లేని చోట రోడ్లు వేయాలి.

– రామాయణం ఏడుకొండలు, ఎన్టీఆర్ కాలనీ, గొల్లవానితిప్ప

శ్రీవారి క్షేత్రంలో మంచు సోయగం



శ్రీవారి ఆలయ జంట గోపురాలపై మంచు పరదా

శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం మంచు సోయగం ఆకట్టుకుంది. క్షేత్రంలో ఉదయం 9 గంటలైనా మంచు వీడలేదు. ఆలయ గోపురాలు, పరిసరాలు, ఘాట్ రోడ్లు కనిపించనంతగా మంచు కప్పేసింది. దీంతో చినవెంకన్న దర్శనార్థం పలు ప్రాంతాల నుంచి వివిధ వాహనాలపై క్షేత్రానికి విచ్చేసిన భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొందరు ముందుకు వెళ్లలేక పార్కింగ్ లైట్లు వేసి రోడ్ల పక్కన వాహనాలను నిలిపివేశారు. మరి కొందరు అవే లైట్ల వెలుగులతో కొండపైన సెంట్రల్ పార్కింగ్ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఏడాది శీతాకాలం మొదలయ్యాక క్షేత్రంలో భారీగా మంచు కురవడం ఇదే ప్రథమం.

– ద్వారకాతిరుమల



లైట్ల వెలుగుల్లో కొండపైకి చేరుకుంటున్న భక్తుల వాహనాలు



కొండపైన సెంట్రల్ పార్కింగ్ వద్ద ఇలా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని వేగవరంలో వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడి మృతిచెందగా, మరో యువకుడు గాయపడ్డాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కమటం చరణ్‌తేజ్ (18), తన స్నేహితుడు పెడపెట్ల సన్నీతో కలిసి శుక్రవారం రాత్రి జంగారెడ్డిగూడెం మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. వేగవరం విజయ కంటి ఆసుపత్రి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం వీరి మోటార్‌సైకిల్‌ను ఢీకొనడంతో వీరికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు చరణ్‌తేజ్ మృతి చెందినట్లు తెలిపారు. పెడపెట్ల సన్నీని మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చరణ్ తండ్రి కమటం భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రక్కు ఆటో బోల్తా.. దంపతులకు గాయాలు

ద్వారకాతిరుమల: కొబ్బరి బొండాల లోడుతో వెళుతున్న ఒక ట్రక్కు ఆటో రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానిక ఆళ్వార్ సదనం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న దంపతులిద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడేనికి చెందిన రాచప్రోలు కాంతారావు, శిరీష దంపతులు, ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం నుంచి ట్రక్కు ఆటోలో కొబ్బరి బొండాలు లోడు వేసుకుని స్వగ్రామానికి వెళుతున్నారు. ఆళ్వార్ సదనం వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి, రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న కాంతారావు, పక్కన కూర్చున్న అతని భార్య శిరీష తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

యువకుడిపై వ్యక్తి దాడి

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట ప్రాంతంలో శనివారపుపేట కాజ్‌వే నాలుగు రోడ్ల కూడలి వద్ద కారులో వెళ్తున్న వ్యక్తి బైక్‌పై వెళ్తున్న యువకుడిపై రాడ్డుతో దాడి చేశాడు. ఏలూరు సత్రంపాడుకు చెందిన ఎం.సాయికుమార్ అమీనాపేట వైపు బైక్‌పై వెళ్తున్నాడు. లోబ్రిడ్జి దాటిన అనంతరం నాలుగురోడ్ల కూడలి వద్ద ఒక కారు ఎదురుగా రావడంతో కారులోని వ్యక్తి తప్పు నీదంటూ సాయికుమార్‌తో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఒక్కసారిగా కారులోని వ్యక్తి రాడ్డుతో సాయికుమార్‌పై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. అయితే గొడవ పడిన వ్యక్తి కారుపై జిల్లా జడ్జి అనే నేమ్‌ప్లేట్ ఉందని, కారు నెంబర్ ఏపీ 39 డీటీ799గా అని బాధితుడు చెబుతున్నారు. బాధితుడి వాంగ్మూలాన్ని ఏలూరు జీజీహెచ్‌లోని అవుట్‌పోస్ట్ పోలీసులు నమోదు చేశారు.

తాతయ్యకు తలకొరివి పెట్టిన మనుమరాలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలో ఓ బాలిక తన తాతయ్యకు దహన సంస్కారాలు నిర్వహించింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వినుకొండ నాగేశ్వరావు (60) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. ఆయనకు ఒక కుమారుడు కరుణబాబు ఉండేవాడు. కొంత కాలం క్రితం అతను చనిపోయాడు. దీంతో కరుణబాబు కుమార్తె నాగేశ్వరరావు మనవరాలు వినుకొండ శరణ్య హిందూ ధర్మప్రకారం తాతయ్యకు తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది.



అడవిపాలెంలో తాతయ్యకు దహన సంస్కారాలు చేస్తున్న మనుమరాలు వినుకొండ శరణ్య

ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌కు జైలు

నూజివీడు: లారీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ నల్లా ప్రభాకర్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ.200ల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020సెప్టెంబరు 26న కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన దాసరి లెనిన్, ఆయన కుమార్తె వంజరపు శ్రీదేవి సొంత పనిపై ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం వెళ్లేందుకు బయలుదేరారు. కానుమోలు శివారులో ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో వారిరువురూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి ఛార్జిషీట్ వేశారు. విచారణ అనంతరం స్పెషల్ మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్న వాదనలు వినిపించారు.

గుండెపోటుతో బస్సులోనే ప్రయాణికుడి మృతి



మహమ్మద్ జావీద్ మృతదేహం

నూజివీడు: బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన నూజివీడులో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని మిట్టగూడెంలోని ఆంజనేయ కోల్డ్‌స్టోరేజి మీట్ కంపెనీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ జిల్లా పసోండాకు చెందిన మహమద్ జావీద్(50) అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగం నిమిత్తం ఉదయం మిట్టగూడెంలో విజయవాడ బస్సు ఎక్కాడు. నూజివీడు వచ్చిన తరువాత బస్సు దిగి బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చాడు. ఆ తరువాత బస్సు బయలుదేరిన రెండు నిమిషాలకే రాజీవ్‌సర్కిల్ వద్దకు వెళ్లేసరికి గుండెపోటుతో సీట్లోనే పక్కకు ఒరిగిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులు ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నారు. సీఐ పి.సత్యశ్రీనివాస్ జావీద్ మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్యాల పోటీలో విద్యార్థి ప్రతిభ



దొంగ సత్య మనోజ్ఞ

నరసాపురం రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సర్వశిక్షా అభియాన్ పథకంలో రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పద్యాల విభాగంలో దొంగ సత్య మనోజ్ఞ రాష్ట్రస్థాయి మొదటి బహుమతి సాధించింది. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యమనోజ్ఞ 10వ తరగతి చదువుతోంది. వారధి 4.0 పోటీలో పద్యాలు, వ్యాసరచన, డిబేట్ తదితర పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి మొదటి బహుమతి సాధించిన సత్య మనోజ్ఞ బ్యాంకు ఖాతాకు నగదు సొమ్ము జమ అవుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పద్యాల విభాగంతో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని మనోజ్ఞను హెచ్‌ఎం రామరాజు, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ చూడామణి తదితరులు అభినందించారు.

కొబ్బరి ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలి

ఉండి: జిల్లాలో విస్తారంగా ఉన్న కొబ్బరిని వినియోగించుకుని దాని ద్వారా ఉప ఉత్పత్తులను తయారు చేసి అభివృద్ధి సాధించేలా ఔత్సాహికులంతా దృష్టి సారించాలని కేవీకే హెడ్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. కేవీకేలో హోమ్ సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ డెబోరామెస్సియానా ఆధ్వర్యంలో కొబ్బరి ఉప ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పతుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మన దేశంలో ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో కొబ్బరిని అధికంగా సాగు చేస్తున్నారన్నారు. అయితే కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి మనం కేవలం 8 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఫిలిఫ్పీన్స్, థాయ్‌లాండ్, ఇండోనేషియా వంటి దేశాలు 50 శాతం పైబడి వినియోగించుకుంటున్నాయని అన్నారు. ఔత్సాహితుకులైన యువత కొబ్బరిపై ప్రత్యేక దృష్టి సారిస్తే అద్భుతమైన వ్యాపారాన్ని చేయవచ్చునని అన్నారు. మనకు సులభంగా దొరికే కొబ్బరి ద్వారా కొబ్బరి లడ్డూ, కొబ్బరి బర్ఫీ, కొబ్బరి జామ్, కొబ్బరి లైమ్‌నైడ్, కొబ్బరి వెనీలపౌడి, కొబ్బరి జున్ను, కొబ్బరినూనె, కొబ్బరి కేక్, నూనె తీసేసిన కొబ్బరి కేక్ వంటి ఎన్నో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయవచ్చన్నారు. మంచి మార్కెటింగ్ లేదా ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఉత్పత్తులు అమ్మకాలు సాగిస్తూ మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉందన్నారు. కాబట్టి నిరుద్యోగులు, మహిళలు, యువత కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం తయారు చేసిన కొబ్బరి ఉప ఉత్పత్తులను అందరికీ తినిపించి వారి వారి అభిప్రాయాలను శాస్త్రవేత్తలు సేకరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఆర్.బిందు ప్రవీణ, డాక్టర్ పి.వినయలక్ష్మి, బి.రజిత తదితరులు పాల్గొన్నారు.



కేవీకేలో కొబ్బరి ఉప ఉత్పత్తులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెళ్లి బాజా మోగేనంట

- ఏడాదిలో మూడు నెలల మినహా అన్ని నెలల్లో ముహూర్తాలు
- కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల బుకింగ్‌కి డిమాండ్



కల్యాణ మండపం

భీమవరం(ప్రకాశం చౌక్): 2025 పెళ్లిళ్ల సందడికి మంచి తరుణంగా నిలవనుంది. ఈ ఏడాది 12 నెలల కాలంలో కేవలం మూడు నెలలు మినహా మిగిలిన తొమ్మిది నెలల్లో 104 పెళ్లి ముహూర్తాలు ఉండటం విశేషమని అర్చకులు చెబుతున్నారు. గడచిన మూడేళ్లలో పెద్ద సంఖ్యలో లేని ముహూర్తాలు ఈ ఏడాదిలో మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఈ నెల 22 నుంచే పెళ్లిళ్ల ముహూర్తాలు ప్రారంభం కానున్నా, కొందరు ఈ నెల 30 నుంచి ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయని చెబుతున్నారు. అయితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మినహా ఈ ఏడాది అన్ని మాసాల్లోనూ ముహూర్తాలు ఉండటం విశేషం.

ముందే బుకింగ్‌లు

ఈ ఏడాది పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగింది. సాధారణ ఫంక్షన్ హాళ్ల దగ్గర నుంచి పెద్ద ఫంక్షన్ హాళ్ల వరకు అన్నింటికీ ముందస్తు బుకింగ్‌ల కోసం ఎగబడుతున్నారు. పెళ్లిళ్లకు సంబంధించి నెల నుంచి రెండు నెలల ముందే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు. ద్వారకాతిరుమల చిన్న వెంకన్న క్షేత్రం, భీమవరం, పాలకొల్లు పంచారామ క్షేత్రాలు, భీమవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, భీమవరం భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, తణుకు వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వంటి పుణ్య క్షేత్రాల్లో ముందస్తు బుకింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.

ముహూర్తాలతో ఉపాధి

ఈ ఏడాది ముహూర్తాలు అధికంగా ఉండడంతో అందరికీ మంచి ఉపాధి లభించే అవకాశముంది. దుస్తులు, బంగారం, కిరాణా వ్యాపారాలు జోరందుకోనున్నాయి. లైటింగ్, డెకరేషన్, షామియానా, టైలరింగ్, వాయిద్య కళాకారులు, బ్రాహ్మణులు, రజకులు, నాయీబ్రాహ్మణులు, వంట మేస్త్రీలు, పువ్వుల వ్యాపారులు, పెయింటర్లు, ఫొటోగ్రాఫర్లు, ట్రావెల్స్ తదితర అన్ని రంగాల వారికీ మంచి ఉపాధి లభించే అవకాశముంది.

ఈ ఏడాది ముహూర్తాలు ఇలా...

- జనవరి : 22, 23, 24, 25, 29, 30, 31 తేదీలు
- ఫిబ్రవరి : 4. 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15
- మార్చి : 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26 తేదీలు
- ఏప్రిల్ : 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29 తేదీలు
- మే : 1, 2, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 14, 20, 27, 28, 29, 30 తేదీలు
- జూన్ : 3, 4, 5, 6, 7, 10, 11, 12 తేదీలు
- జూలై, ఆగస్టు, సెప్టెంబర్ : లేవు
- అక్టోబర్ : 14, 16, 17, 18, 20, 21, 22, 23, 25, 30, 31 తేదీలు
- నవంబర్ : 7, 13, 14, 18, 19, 20, 21, 22, 26, 27
- డిసెంబర్ : 2, 4, 5, 6, 15, 16, 17, 18, 19, 20, 23, 24, 30 తేదీలు

ఈ ఏడాది ఎక్కువ ముహూర్తాలు



గడచిన మూడేళ్లలో కంటే ఈ ఏడాది ఎక్కువ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు ఈ ఏడాది అంతా అనువుగా ఉంటుంది. ప్రస్తుతం శ్రీ క్రోధి నామ సంవత్సరం నడుస్తోంది. మార్చి నుంచి శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ తెలుగు ఏడాది కూడా అన్ని శుభకార్యాలకూ అనువైన కాలంగా ఉండనుంది.

– మద్దిరాల మల్లికార్జున శర్మ (చిన్ని), మావుళ్లమ్మ వారి ఆలయ ప్రధాన అర్చకుడు

ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు



శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో మా దేవస్థానంలో ముందస్తుగానే పెళ్లిళ్లకు సంబంధించి బుకింగ్ చేసుకుంటున్నారు. దేవస్థానానికి వచ్చి, వారికి కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని పేర్లు నమోదు చేసుకుంటున్నారు. మా దేవస్థానంలో ప్రతి ఏడాదీ అత్యధికంగా పెళ్లిళ్లు జరుగుతాయి.

– ముదునూరి సత్యనారాయణరాజు, ఈఓ, వేంకటేశ్వరస్వామి ఆలయం, భీమవరం

క్లుప్తంగా

పాఠశాలలో సామాజిక తనిఖీ



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఆర్పీ నరేష్

అత్తిలి: సామాజిక తనిఖీలలో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఆర్పీ డి నరేష్ తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం రికార్డులు, పీఎంశ్రీ స్కూల్ రికార్డులు, పాఠశాలకు సంబంధించిన ఇతర రికార్డులను ఆయన పూర్తిస్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ నరేష్ విద్యార్థులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ప్రథమ సహాయకుడు ఎస్ పురుషోత్తం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు



వాసవిలో జేఈఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్ పరీక్షలు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం పరీక్షకు 220 మంది హాజరుకావాల్సి ఉండగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. సాయంత్ర పరీక్షకు 220 మందికి గాను 219మంది హజరయ్యారు. ఈనెల 30 వరకు పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంటు డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు.


విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సినేషన్



తణుకులో విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సినేషన్ వేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం టైఫాయిడ్ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా టైఫాయిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తణుకు రూట్స్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 248 విద్యార్థులకు వ్యాక్సినేషన్ చేయించినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ వారిచే రూ.350 వ్యాక్సిన్‌ను కేవలం రూ.120లకు అందజేసినట్లు వివరించారు. డాక్టర్ ఎ. సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పులపాబాబు ప్రసాద్, కోశాధికారి ఎ.రాజు, పుట్టా విజయశ్రీ, కిరణ్, పుట్టా రామచంద్రరావు, రూట్స్ పాఠశాల డైరెక్టర్ త్రిపాఠి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏరియా ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఐదు నెలల జీతాలు బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మండల హరీష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. హరీష్ మాట్లాడుతూ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఐదు నెలలు జీతాలు బకాయిలు చెల్లించాలని కోరుతూ సమ్మె ప్రారంభించిన ఏలూరు సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. బకాయిలు పడిన పీఎఫ్ సొమ్మును సంస్థకు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

పెంటపాడు: అక్రమంగా మద్యం సేవించి పలు ప్రాంతాలలో నిషేధిత మద్యం బాటిళ్లు అమ్ముతున్న వ్యక్తులను గూడెం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం పెంటపాడు మండలంలో ఇద్దరు, గణపవరం మండలంలో ఒకరిని, మొత్తం 3 గురిని అరెస్టు చేసి ఆయా తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేయించామన్నారు. మరోసారి మద్యం అమ్మితే రూ. 1.50 లక్షలు అపరాధ రుసుం కట్టించుకొని వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇనస్పెక్టర్ మురళి, దొరబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ఏది బాబూ?

- ఊసేలేని ఉచిత బస్సు
- మహిళామణుల ఎదురుచూపులు
- ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడిచినా అందుబాటులోకి రాని ఉచిత బస్సు
- అధికారం కోసమే హామీలా అని నిలదీస్తున్న వైనం



తణుకులో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

తణుకు అర్బన్ : మహిళలందరూ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఎదురుచూపులు చూస్తున్నా కూటమిప్రభుత్వం మాత్రం ఉచిత బస్సు ఊసేలేకుండా పాలనచేస్తున్న వైనాన్ని మహిళాలోకం తీవ్రంగా విమర్శిస్తోంది. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆర్టీసీబస్సు ప్రయాణం ఉచితమంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఊదరగొట్టారని నేడు మాత్రం ఉచిత బస్సు అమలుచేసే విధంగా అడుగులు వేయడంలేదని ఆరోపిస్తున్నారు. ఇచ్చిన మాటను అమలు చేయలేనప్పుడు హామీ ఇవ్వడం ఎందుకని మహిళలు నిలదీసే పరిస్థితి తలెత్తింది. ఆర్టీసీ ప్రయాణం ఉచితం చేస్తున్నారు కదా అని ఓట్లేశామని తీరా గెలిచిన తర్వాత ఉచిత బస్సు పథకం గురించి మాటైనా మాట్లాడడంలేదని వాపోతున్నారు.

తణుకు డిపో నుంచి 20వేలకుపైగా మహిళల ప్రయాణం

తణుకు ఆర్టీసీ డిపోకి సంబంధించి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్, అల్ట్రా డీలక్స్, ఇంద్ర బస్సులు 60తోపాటు 21 అద్దె బస్సులు కలిపి మొత్తం 81 బస్సులు తణుకు డిపో నుంచి నిత్యం నిర్దేశించిన ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. ఇందులో సుమారుగా 20వేలకుపైగా మహిళలు తణుకు డిపో నుంచి వివిధ ఊర్లకు వెళ్తు ప్రయాణిస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినా ఇంతవరకు ఉచిత బస్సు పథకం అమలు చేయలేదంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. నలుగురు మహిళలు కలిస్తే ఉచితబస్సు, ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి పథకాలపై చర్చ చేసుకుంటూ ప్రభుత్వాన్ని తూర్పారబెడుతున్నారు.

అమలు చేయలేనప్పుడు హామీ ఇవ్వడమెందుకు ?



మహిళలకు ఆకర్షించేందుకు ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిన కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పుడు ఆ పథకం గురించి మాట్లాడకపోవడం దారుణం. మహిళలకు హామీ ఇచ్చిన ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి.

– మెహర్ అన్సారీ, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు

7 నెలలు గడిచాయి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినా ఇంతవరకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత బస్సు పథకాలను వెంటనే అమలు చేయాలి.

– నూకల కనకదుర్గ, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు

జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీటీసీ): విశ్రాంత ఉద్యోగులు తప్పక జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ తాడేపల్లిగూడెం యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ భవనంలో శుక్రవారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. హరికుమార్ మాట్లాడుతూ ట్రెజరీ పరిధిలో 3 వేల మంది పెన్షనర్స్ ఉన్నారని, నేటికి 1500 మంది మాత్రమే వారి జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేసుకున్నారని తెలిపారు. పెన్షనర్స్ ఎవరైన అనారోగ్యంతో ఉంటే వారి వివరాలను అసోసియేషన్‌కు తెలియజేస్తే అసోసియేషన్ సభ్యులు పెన్షనర్స్ ఇంటికి వచ్చి సదరు లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చే సదుపాయం చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు సమయం ఉందని సద్వినియోగం చేసుకోవచ్చునని చెప్పారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్న పెన్షనర్స్‌కు ఎడిషనల్ కోంటమ్ పెన్షన్ పునరుద్ధరణ చేయడం లేదని, డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, కొత్త పీఆర్సీ వచ్చేలోగా 30 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లింపు జరగలేదని, హెల్త్ కార్డులపై అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించడం లేదని, రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాసం నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ముస్తాఫా, కేవీ వీరారావు, అర్జునరావు, సత్యనారాయణ రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు ఘన నివాళి



అత్తిలిలో జననాయక్ కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న, నాయీ బ్రాహ్మణ ముద్దుబిడ్డ, జననాయక్ కర్పూరి ఠాగూర్ శత జయంతిని శుక్రవారం అత్తిలి నాయి బ్రాహ్మణ కమ్యూనిటీహాలు భవనంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కర్పూరీ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన చరిత్రను వివరిస్తూ, కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న రావడం అనేది యావత్తు నాయి బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని అన్నారు. సామాన్య నాయీ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చి ఎమ్మెల్యే, మంత్రి, రెండు సార్లు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం సామాన్యమైన విషయం కాదని అన్నారు. ఆయన నిజాయతీని, పట్టుదల, నిస్వార్థ సేవను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పసుమర్తి సీతాంబరం, ఉపాధ్యక్షుడు కొడవర్తి సురేష్, సెక్రటరీ అయినపర్తి వెంకటేష్, కోశాధికారి పోలవరపు కుమార్, జాయింట్ సెక్రటరీ చీపురపల్లి సాయిసతీష్, అయినవిల్లి ఏసురాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు డ్రై డే పాటించాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ ఆఫీసర్ వై.వి.లక్షణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్‌కాలనీ పరిధిలోని 6, 7 వార్డులలో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలపై పరిశీలన, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. వార్డుల్లో ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరు ఆరోగ్య నియమాలు పాటించాలని, ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం అన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమ లార్వా ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మేరీ, మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, జ్యోషిబాయ్, ఆశాలు స్వాతి, దుర్గ, వరలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఏలూరి కాంతారావు, తదితరులు పాలొన్నారు.

పాడి పశువులకు వ్యాక్సినేషన్ చేయించాలి



తాడేపల్లిగూడెం రూరల్: రామన్నగూడెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం దృశ్యం



పెంటపాడు: దర్శిపర్రు గ్రామంలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ కోలా శేషవేణి

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువులు, జీవాలకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని రామన్నగూడెం గ్రామ కమిటి అధ్యక్షుడు మద్దిపాటి రవితేజ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయడం ద్వారా పాడి పశువులను సంరక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శిపర్రులో పశువైద్య శిబిరం

పెంటపాడు: పశువుల వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి, పాడి దిగుబడులు అధికంగా పెంచాలని దర్శిపర్రు గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి, మండల పశువైద్యాధికారి మహేష్‌లు పేర్కొన్నారు. మండలంలో 200 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం రైతులకు మిక్చర్ ఫ్యాకెట్లు అందజేశారు. పశువుల పోషణకు సంబంధించి పట్టికను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయసంచాలకులు అనిల్‌కుమార్, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు డ్రోన్ స్ప్రేయింగ్ విధానాన్ని ఉపయోగించాలి

తణుకు అర్బన్: పురుగు, తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకునే క్రమంలో రైతులు డ్రోన్ స్ప్రేయింగ్ విధానాన్ని ఉపయోగించాలని వ్యవసాయాధికారిణి కె.కుసుమ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డ్రోన్ స్ప్రేయింగ్ ద్వారా తక్కువ ఖర్చుతో పంటలపై ఉండే క్రిమికీటకాలను పారద్రోలవచ్చని సూచించారు. ఈ విధానం వలన తుంపర్లు సూక్ష్మంగా చిమ్మడం వలన పంట అంతటికీ వెదజల్లే అవకాశం ఉంటుందని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందేందుకు ఇదొక మంచి మార్గమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, చీర్ల రాధాకృష్ణ, శిరిగిశెట్టి వెంకటేశ్వరరావు, మద్దూరి రాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాలోత్సవం నిర్వహణ అభినందనీయం



తణుకు బాలోత్సవ వేదికపై వివిధ వేషధారణలతో చిన్నారులు

తణుకు అర్బన్ : బాలల్లో ఉత్సాహాన్ని నింపే విధంగా బాలోత్సవాన్ని వేలాది మంది విద్యార్థులతో నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలలు సమాజంలోని సమూహంలోకి వచ్చే మొట్టమొదటి వేదిక పాఠశాలలేనని స్పష్టం చేశారు. మార్కులు ఎక్కువ వచ్చే పిల్లలను ప్రతిభకల విద్యార్థులుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారని కానీ జవాబులు బాగారాసే పిల్లల కంటే ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకున్న వాళ్లే ప్రతిభ కల విద్యార్థులుగా పరిగణించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానం పెరుగుతున్న నేటి రోజుల్లో విద్యార్థులపై ఆ ప్రభావం ఎక్కువవుతుందని అటువంటి పరిస్థితుల్లో ఇటువంటి బాలోత్సవాలు పిల్లలను చైతన్యపరచడంతోపాటు వారిలో ఉన్న నైపుణ్యాన్ని కూడా బయటకు తీస్తుందని అన్నారు. ఈ సందర్భంగా బాలలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు పీఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, ఏఎస్‌వీ శేషబాబు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ప్రగతి రాజా, రూట్స్ స్కూలు డైరెక్టర్ బి.విద్యాకాంత్, మానవత జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, వివిధ పాఠశాలల నుంచి హాజరైన 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగరాజ కీర్తనలను ఆరాధించాలి

తణుకు అర్బన్: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ కీర్తనలను ప్రతి ఒక్కరూ ఆరాధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తణుకు శ్రీరామకృష్ణ సేవాసమితి భవనంలో శుక్రవారం నిర్వహించిన త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తణుకులో 86 సంవత్సరాలుగా సద్గురు త్యాగరాజ ఆరాధన సంగీత మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవ సొసైటీ అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మి, సుజాత, కార్యదర్శి జీడిగుంట శర్వాణి, కోశాధికారి ఇందిర, సహాయ కార్యదర్శి బంక వసుంధర, సభ్యులు గమిడి సరోజ, కార్యదర్శి బమిడి కమలాదేవి, వావిలాల సరళాదేవి, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: వాహనదారులు రహదారిపై వాహనాలు నడిపే సమయంలో భద్రత నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర సింగ్ నాయక్ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లిలో ప్రైవేట్ స్కూలు బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు అవగాహన కల్పించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



తేతలి లేఅవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

తణుకు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చేనెల 1వ తేదీన తణుకు పర్యటన నేపధ్యంలో ఆయా ప్రాంతాలను జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం పరిశీలించారు. పీఎంఏవై ఎన్టీఆర్ నగర్స్ హౌసింగ్ లేఅవుట్లను, తణుకు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని హెలిపాడ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీబ్ కౌశల్ భానో, తహసీల్దార్ దండు అశోక్ వర్మ, హౌసింగ్ పీడీ వై.హరనాథ్, హౌసింగ్ డీఈలు పిచ్చయ్య, వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అత్తిలి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కర్నూలు జిల్లాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను పట్టపగలు నడిరోడ్డుపై నరికి చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు రాజకీయ ఒత్తిళ్లకు గురౌతున్నారని, గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని, దారుణ హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రభుత్వం ఆదుకుని వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ. 30లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కె రమేష్, పిల్లి ఏసురత్నం, మహేష్‌రెడ్డి, సూర్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు దేశ సేవ చేయాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి య. విక్టర్ ప్రేమ్‌సాగర్, విజయబాబు, రెడ్ రిబ్బన్ క్లబ్ కుసుమ, గందం వాణి, ఇందిర, జాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే జీవితానికి వెలుగు

పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం



వీరంపాలెం జెడ్పీహెచ్‌లో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : ఆధునిక కాలంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు రాలు బీవీఎన్ నాగమల్లేశ్వరి తెలిపారు. మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు బీవీఎన్. నాగమల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు చెప్పే మాటలను నమ్మవద్దని సూచించారు. వివాహ వయస్సు రాకుండా బాలికలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి తమ్మిశెట్టి ఉషోదయ, సంక్షేమ సహాయకులు డి.దుర్గారావు, అంగన్‌వాడీ వర్కర్ ఎం.పద్మావతి, ఎం. సుజాత, ఎస్. చందు, ఎస్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే, కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.వరలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ఏడు కొండలు

భవిత కేంద్రంలో..

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఆడ పిల్లలను సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు గౌరవించాలని, వారిని ప్రోత్సాహించాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చట్టాలపై అవగాహన జరిగింది. మహిళా సంరక్షణ పోలీస్ సీహెచ్ ప్రశాంతి, డైమండ్స్ సభ్యులు ఆంజనేయస్వామి, భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, పాఠశాల ఉపాధ్యాయిని కె.కుమారి, సత్యవతి, రత్నకుమారి, నాగలక్ష్మి, శ్రీదేవి, పోతురాజు, భవిత విద్యార్థులు, తలిదండ్రులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాలలో ముందుండాలి

పెంటపాడు: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ముదునూరు ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం దర్శిపర్రు గ్రామంలో ముదునూరు వైద్యాధికారిణి డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రత్నం, తేజ ఆశాలు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విప్పర్రు, కె. పెంటపాడు, పెంటపాడు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

పైడిపర్రు పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం

తణుకు అర్బన్: సమాజంలో బాలికలపై ఉన్న వివక్షను తొలగించి వారికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడమే బాలికాదినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎమ్.ఏడుకొండలు అన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో బాలికలకు ఉన్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, ఏసుకృప, రామకృష్ణ, విజయకుమారి పాల్గొన్నారు.